క్లుప్తంగా

మెరుగైన సేవలు అందించేందుకే భవన నిర్మాణాలు

పాలకోడేరు: కొండేపూడి గ్రామంలో నిర్మాణంలోని సచివాలయాన్ని, వేండ్రలో జలజీవన్ పథకంలో మంజూరైన ఓహెచ్ఆర్ నిర్మాణాన్ని శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) పరిశీలించారు. నాణ్యతా లోపం లేకుండా, సకాలంలో జాప్యం లేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఇప్పటికే విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, గరగపర్రు, పాలకోడేరు గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలను ప్రారంభించామని, మిగిలిన గ్రామాల్లో నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో వేండ్ర, కొండేపూడి సర్పంచ్‌లు కదలి నాగేశ్వరి, చింతపల్లి వెంకటనారాయణ, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, బొక్కా రాంబాబు, చింతపల్లి కొండలరావు, పాలా శ్రీను, కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సహకార సేవలను వినియోగించుకోవాలి

పాలకోడేరు: రైతులకు మెరుగైన సేవలందిస్తున్న సహకార సంఘాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ డిస్ట్రిక్ట్ రిజిస్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సహకార వారోత్సవాలను పాలకోడేరు సహకార సంఘం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. పాలకోడేరు సహకార సంఘ చైర్ పర్సన్ కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు సహకార జెండాను తొలుత ఎగరవేశారు. ఈ సందర్భంగా పాలకోడేరు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లోని విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందించారు. జిల్లాలో అత్యుత్తమైన సేవలందిస్తున్న సహకార సంఘంగా పాలకోడేరు సహకార సంఘానికి 100 ఏళ్లకు పైగా ఘన చరిత్ర ఉందని సంఘ సీఈఓ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, పాలకోడేరు సహకార కళాశాల ప్రిన్సిపాల్ వి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశాల నిర్వహణ

ఉండి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఎస్‌వీ భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

కాళ్లలో..

కాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చిస్తామని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

పంచారామ క్షేత్రంలో చీరల వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక గునుపూడి పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో భక్తులు సమర్పించుకున్న చీరలు, పంచెల వేల ద్వారా రూ.30,565 ఆదాయం వచ్చిందని ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ దేవస్థానం కార్తీకమాసోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం భక్తులు దర్శనాల ద్వారా రూ.9,200, పూజా రుసుముల ద్వారా రూ.6,930, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,880, విరాళాల ద్వారా రూ.2,000 మొత్తం రూ.21,010 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. చీరల వేలం ధర్మకర్తలు వి.వెంకటేశ్వరరావు తనిఖీదారు దేవదాయ శాఖ భీమవరం సమక్షంలో నిర్వహించారు.

యువకుడి అదృశ్యం

పాలకోడేరు: తన కుమారుడు కొల్లి ధర్మారావు (23) ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని తండ్రి కొల్లి పెద ధర్మారావు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ధర్మారావు కుటుంబం తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలం నుంచి వచ్చి గొల్లలకోడేరులో కాపురం ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): నాగుల చవితి సందర్భంగా భీమవరంలో పలు ప్రాంతాల్లోని పాము పుట్టల వద్ద భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. పుట్టల్లో పాలు, గుడ్లు వేశారు. చినరంగనిపాలెం రామాలయం ప్రాంగణంలోని పుట్ట వద్దకు భక్తులు పూజ చేశారు. శ్రీరాంపురంలో రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యస్వామి వారికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీ కృష్ణంరాజు పాల్గొన్నారు. భీమవరం ఆలయాల్లోని అమ్మవార్ల భక్తులు దర్శించుకున్నారు.

యనమదుర్రు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో శుక్రవారం పార్వతి సమేత శక్తీశ్వర స్వామి ఆలయంలో వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామికి నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు పుట్టల వద్ద, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల వద్ద తేగలు, చలిమిడి, అరటిపళ్లు, కోడి గుడ్లు, ఆవుపాలతో పూజలు నిర్వహించారు.

ఉండిలో..

ఉండి: మంచి మనసే మానవ మనుగడకు ముఖ్యమైనదని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శుక్రవారం నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం యండగండిలోని నాగదేవత గుడిలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని ఊరువాడ భక్తిశ్రద్ధలతో నాగులచవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని పలు గ్రామాలలో భక్తులు శుక్రవారం నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా కాళ్ల, కోలనపల్లి, బొండాడ, జక్కరం, కాళ్లకూరు, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కోపల్లె, పెదఅమీరం, సీసలి తదితర గ్రామాల్లో వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సమేతంగా సమీపంలోని పుట్ట వద్దకు చేరుకుని పూజలు చేసి పాలు పోశారు.



ఉండి: యండగండిలో నాగదేవత గుడిలో పుట్టలో పాలుపోస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



భీమవరం సుబ్బారాయుడు గుడిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



భీమవరం చినరంగనిపాలెం రామాలయం ప్రాంగణంలోని పుట్ట వద్ద పూజ చేస్తున్న భక్తులు

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

ఎంపీపీ విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి చేకూర్చడంతోపాటు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలం తాడేరు గ్రామంలో రెండో రోజు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి, గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పేరిచర్ల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపనకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, పథకాల లబ్ధిని పారదర్శకంగా అర్హుల ఖాతాల్లో జమ చేస్తున్నారని వివరించారు. ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయడమే కాకుండా డ్రెయినేజీలు, సీసీరోడ్లు, నిర్మించడమే కాకుండా జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాడు - నేడు పథకం ద్వారా సుమారు రూ.21 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. తాడేరు వద్ద గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై రూ.2.30 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 15 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే నాలుగెకరాల భూమిని కొనుగోలు చేసి 100 పడకల ఆస్పత్రి కోసం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించారని గుర్తుచేశారు. యనమదుర్రు డ్రెయిన్‌పై ఉన్న మూడు వంతెనల అప్రోచ్‌ల నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు చేయించారన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు నాలుగుచోట్ల అండర్ టన్నెల్స్ నిర్మించారని తెలిపారు. వైఎస్సార్ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అండగా ఉండాలని ప్రజలను కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, మండల యువత నాయకుడు నామన మహేష్, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, గూడపాటి పెద్దిరాజు, సంబలదీవి మోహన్, శిరిగినీడి ప్రసాద్, సామన బాబులు, సామన సత్యనాయహణ, బేతపూడి నాగేశ్వరరావు, మట్టా ఏసు, నామన నాని, గెల్లి కోటేశ్వరరావు, కొట్టి కుటుంబరావు, సర్పంచ్‌లు చిల్లే వెంకటేష్, కోళ్ల బాలకృష్ణ, తిరుమాని ధనంజయరాజు, తిరుమాని తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



తాడేరులో ప్రజలకు చేకూరిన లబ్ధి వివరిస్తున్న నాయకులు

పుస్తక పఠనంపై అవగాహన



పాలకోడేరు: గొల్లలకోడేరులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడు: దుంపగడప గ్రామంలో వీవీ.గిరిప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థి దినోత్సవం, పుస్తక పఠనం ఆవశ్యకత కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల దేవి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ తాను చిన్నతనంలో గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించే వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నానని, గ్రంథాలయాల్లో పుస్తకాలు ఎక్కువగా చదివానని, పుస్తక పఠనం మేధా సంపత్తిని పెంపొందిస్తుందని అన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్సార్ రంగనాథన్, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గురజాడ అప్పారావు, అడవి బాపిరాజు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దయాన వెంకట సురేష్ చంద్రజీ, చదువరుల సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పి.శ్రీనివాస్, కలిగొట్ల గోపాలశర్మ, డి.రామనాగేశ్వరావు, గ్రంథాలయ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గోల్లలకోడేరు శాఖా గ్రంథాలయం లో శుక్రవారం నాడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు అన్న అంశం పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జి.బాలరాజు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలు 14 నుంచి ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: పుస్తకం ఆదర్శవంతమైన పౌరుడిని తయారుచేస్తుందని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదవడం, రాయడం, చిత్రం ద్వారా సృజనాత్మక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఫణి రాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



వేండ్రలో నియామక పత్రాలు అందజేస్తున్న నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ చీఫ్ మేడిది జాన్సన్

పాలకోడేరు: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా కార్యవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షులు రెవరెండ్ ఎ.శ్యాంబాబు అధ్యక్షతన వేండ్రలో నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ మీడియా ప్రెసిడెంట్‌గా గుమ్మాపు శ్యామ్ జోసఫ్, పాలకొల్లు నియోజకవర్గ ప్రెసిడెంట్‌గా ఎం విలియమ్స్, యూత్ ప్రెసిడెంట్‌గా కె.జోష్ పాల్, భీమవరం నియోజకవర్గ ప్రెసిడెంట్‌గా ఆమోసు, భీమవరం నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా ఏలూరి డేనియల్ పాల్, ఆచంట నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్‌గా జీఎస్ కుమార్, ఉండి నియోజకవర్గ ప్రెసిడెంట్‌గా ఒ.ఏలియా, భీమవరం నియోజకవర్గ కార్యదర్శిగా పి.పాల్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌లుగా ఈద విజయ్ ప్రసాద్, కె.ప్రసాద్‌రావులు ఎన్నికయ్యారు. వీరికినేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ చీఫ్ మేడిది జాన్సన్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బి.జార్జి ముల్లర్, కార్యదర్శి ఒ.మనోజ్ బాబు పాల్గొన్నారు

జగనన్నకు చెబుదాం, ఉద్యోగుల గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

వీరవాసరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాలకు వినతులు వెల్లువెత్తాయి. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 72, ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు వచ్చాయి. కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో కొన్ని ఇలా..

- వీరవాసరం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్వహణలో లోపాలున్నాయని, విచారణ చేసి పూర్తిస్థాయిలో పనులు చేయించాలని ఆ గ్రామ వాసి వర్దినీడి వెంకటలక్ష్మి కోరారు.
- పెర్కిపాలెం గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకంలో మంజూరైన రహదారి అసంపూర్తిగా వదిలేశారని, ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆ గ్రామ వాసి కందులు సతీష్ ఫిర్యాదు చేశారు.
- నరసాపురం వశిష్ట గోదావరి వలందర రేవు కనీస సౌకర్యాలు లేవని, కర్మ కాండల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారని, కనీస సౌకర్యాలు కల్పించాలని వీరవాసరం నివాసి కాకి లక్ష్మీ రాజేష్ కోరారు.
- జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల్లో పనిచేస్తోన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, సెక్యూరిటీ గార్డు పేరును యార్డు అసిస్టెంటుగా మార్పుచేయాలని ఏఎంసీల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం సభ్యులు ఐ.సత్యనారాయణ, సీహెచ్ లక్ష్మణరావు, డి.రాజేష్ కుమార్, వి.రాంబాబు వినతి పత్రం అందజేశారు.
- తనకు మూడు రోజులు జీతం కట్ చేశారని, న్యాయం చేయాలని పాలకొల్లు పురపాలక సంఘం వాటరు వర్క్స్ ఉద్యోగి సాక సునీల్ కుమార్ కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసులరాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాథుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాలు అధికారి, ఇన్‌చార్జి జిల్లా సహకార శాఖ అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, తహసీల్దారు ఎం సుందరరాజు, ఎంపీడీఓ కె.జ్యోతి, ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరంలో ఉద్యోగుల గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్ఆర్‌కేఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

భీమవరం: సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా పెరుగుతుందో అంతే వేగంగా ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానం ప్రాధాన్యత పెరుగుతోందని హైదరాబాద్‌కు చెందిన ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనురాధా సుదర్శన్ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రిఫ్లెక్షన్ ఆన్ కాంటెంపరరీ ఇంగ్లిష్ స్టడీస్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధా సుదర్శన్ మాట్లాడుతూ గ్రామీణ యువత కూడా ఇంగ్లిష్ భాషా ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. టెక్నాలజీతో పాటు భాషకు కూడా ప్రాధాన్యత ఇవ్వటం వల్ల ఇంజినీరింగ్ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలు అందుకునేందుకు అవకాశాలు సుగమం అవుతాయని వివరించారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాథ్యూస్ సంధ్రా కార్మెల్ సోఫియా మాట్లాడుతూ అంతర్జాతీయ కోర్సులు అధ్యయనం చేసేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్న తరుణంలో ఈ అంతర్జాతీయ సదస్సు ఇంజినీరింగ్ అధ్యాపకులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మ సదస్సు ఈ సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీ కృష్ణంరాజు, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, సతీష్ కుమార్ నడింపల్లి తదితరులు పాల్గొన్నారు.



ఈ సావనీర్‌ను ఆవిష్కరించిన నిశాంత్ వర్మ

శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి

భీమవరం: పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని జిల్లా ఎస్పీ యూవీ రవిప్రకాష్ అన్నారు. మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న గ్రౌండ్‌లో సివిల్, ఏఆర్, హోం గార్డ్ పోలీస్ సిబ్బందికి ట్రైనీ డీఎస్పీ కె.అరవింద్ ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. సిబ్బంది ఆరోగ్య విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే వెంటనే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలపై ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సిబ్బందికి శాఖ పరమైన అంశాల్లో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సుబ్బరాజు, భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, ట్రైనీ డీఎస్పీ కె.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ఏఎంసీలో పోలీస్ సిబ్బందికి పరేడ్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజారోగ్య భద్రతకు పూర్తిస్థాయి చర్యలు

భీమవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం వల్లే నేడు ప్రభుత్వ వైద్యులు, కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది కూడా ప్రజల ముందుకొచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం అనాకోడేరు గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మగొప్ప ప్రాంతానికి చెందిన నక్కా ప్రశాంతికి వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల విలువైన ఎల్‌వోసీని శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆమె బంధువు ఇస్సాక్‌కు ఎమ్మెల్యే అందించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3,500 వ్యాధులకు పైగానే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోకిరాని వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి కింద నిధులు మంజూరు చేసి వైద్యం అందేవిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ప్రతిఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, చిన్నపాటి అనారోగ్య సమస్య ఎదురైనప్పటికీ నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వ వైద్య సేవలను పొందాలని శ్రీనివాస్ ప్రజలకు సూచించారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

మాదివాడలో అన్నసమారాధన

ఆకివీడు: గ్రామ దేవతల కరుణకటాక్షాలతోనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక మాదివాడలో ఉన్న గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద దేవీశరన్నవరాత్రి ముగింపు సందర్భంగా, కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన పీవీఎల్ అమ్మవారికి పండ్లు, పూల మాలలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని అంగరంగ వైభవంగా అభివృద్ధి చేసి ప్రతీ ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. అనంతరం పీవీఎల్‌ను గ్రామ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మోటుపల్లి రాజు, కుమారి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, మెప్మా చైర్మన్ మోరా జ్యోతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, చుండూరి వెంకట్రావు, మోటుపల్లి గంగాధరరావు, మోటుపల్లి ప్రసాద్, నిమ్మల నాగు, గునుకుల కొండ, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, అంబటి రమేష్, ఎస్కే హుస్సేన్ పాల్గొన్నారు.



మాదివాడలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రావాడ కుసుమకు సత్కారం

వీరవాసరం: పిల్లల అభిరుచికి తగ్గట్లు తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని వీరవాసరం సొసైటీ చైర్మన్ కొలుపూరి గౌరీ అన్నారు. వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ కుసుమ జాతీయ స్థాయి లాంగ్ జంప్ టీల్లో గోల్డ్ మెడల్ సాధించడంతో వీరవాసరంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. క్రీడా పోటీల్లో మరింత ఉన్నత స్థానానికెళ్లి, వీరవాసరం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గౌరీ కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మతల కాశి, బోను జోష్ణదేవి, బాజీంకి కృష్ణారావు, బాజీంకి గంగా మహేష్, రావాడ దుర్గ, గిరి నక్కెళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రావాడ కుసుమను సత్కరిస్తున్న దృశ్యం